జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్య రక్ష


మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద పేర్లు నమోదు చేయించుకుంటున్న పేషెంట్లు


పేషెంట్లకు ఆరోగ్య నియమాలను తెలియజేస్తున్న డాక్టర్ విజయప్రకాష్, వైద్య సిబ్బంది

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్య రక్షణ కార్యక్రమం అని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. గురువారం మండలంలోని తురకపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందులో ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఇంటివద్దే వైద్య సేవలు అందించటం శుభపరిణామమన్నారు. వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి మెడికల్ క్యాంపులో స్టాల్స్‌ను పరిశీలించి ప్రజలకు అందించే వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రజలకు పలు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, ఎంఎల్‌హెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికే జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. మండలంలోని అగతవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ శిబిరంలో 504 మందికి వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరం ఏర్పాట్లను వెనిగండ్ల పీహెచ్‌సీ మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గజ్జల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. 122 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి మెరుగైన సేవలకు సిఫారసు చేశారు. డాక్టర్ కేఎస్ఎల్ఎన్ చారి, డాక్టర్ ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి, తహసీల్దార్ పి.రత్నం, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి హరిబాబు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి భరోసా లభించిందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని పెదపాలెం గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 385 మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కె.శ్రీకాంత్, వైద్యులు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

చినలింగాయపాలెం(కాకుమాను): గ్రామాలలోని ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పాలన చేయడంతో పాటు ప్రజలందరికి ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి, ఎంపీటీసీ జూపూడి ఏసేబు, పెద్ది మురళి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘సురక్ష’తో ఆరోగ్యానికి భరోసా


సేవలను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజులు


ఎంఎల్‌హెచ్‌పీలతో మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ప్రత్తిపాడు-2 గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 303 మంది రోగులు హాజరయ్యారు. వీరికి జనరల్ వైద్యాధికారులు డాక్టర్ కె.స్రవంతి, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.అంజనాదేవి, చిన్నపిల్లల వైద్యాధికారి డాక్టర్ ముకేష్‌కుమార్, కంటి వైద్యనిపుణులు డాక్టర్ సయ్యద్ సాహెబ్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 43 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. శిబిరాన్ని ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజులు పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, శిబిరం వద్ద రోగులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారన్న వివరాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో శ్రీరమ్య, సీహెచ్‌వో స్వర్ణలత, పీహెచ్ఎన్ నిర్మలకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలి

ఎన్ఆర్ఈజీఎస్ బహిరంగ ప్రజావేదికలో డ్వామా పీడీ డి.యుగంధర్



ప్రత్తిపాడు: జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.యుగంధర్ కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4.48 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఎస్ఆర్పీ సీహెచ్.రాజు నేతృత్వంలో డీఆర్పీలు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో గుర్తించిన లోపాలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు నిర్వహించే గ్రామసభలు రియలిస్టిక్‌గా ఉండాలని, గ్రామసభలకు జనం వచ్చేలా చూడాలన్నారు. గ్రామసభల్లోనే పనులను గుర్తించాలన్నారు. ప్రత్తిపాడు మండలంలో ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదని, పనుల్లో ప్రజలు అత్యధికంగా భాగస్వాములు అయ్యేలా ప్లానింగ్ పక్కాగా ఉండాలన్నారు. ఉపాధి సిబ్బందికి ఇతర శాఖల విధులు లేవని, ఉన్న ఒక్క పనినీ ఎందుకు చెయ్యలేకపోతున్నారని ప్రశ్నించారు. పేద వర్గాలు కవర్ అయ్యేలా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ అంబుడ్స్‌పర్సన్ ఎంఎస్ కౌముది, ఎంపీడీవో ఏ శ్రీరమ్య, ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్‌వలి, ఎస్ఆర్పీలు రాజు, నందిని, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న కాలనీలో మౌలిక వసతుల పరిశీలన


పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి తహసీల్దారు గోపాలకృష్ణ ఎంపీడీవో బాబురావు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనపై మండలాధికారుల బృందం గురువారం పరిశీలించింది. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక మహిళలు జగనన్న కాలనీలో రహదారి, తాగునీటి సమస్యల తదితర అంశాలను కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, ట్రాన్స్‌కో ఏఈ సుధీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ డీఈ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. తాగునీటి మోటార్‌లోని ఒకటి రిపేర్‌లో ఉన్నట్లు గుర్తించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రహదారి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వాహనాల రాకపోకలకు సమస్యలు ఉన్నట్లు లబ్ధిదారులు తెలియజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు మండలాధికారుల బృందం తెలిపింది.

నాలుగో అంతస్తు నుంచి కిందపడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: అపార్టుమెంటు నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు మహిళ కిందపడి మృతి చెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్ నగర్‌లోని బృందావన్ అపార్టుమెంటు నాలుగో అంతస్తు ఫ్లాట్‌లో ఆవుల గాయత్రి (31) నివసిస్తున్నారు. బాల్కనీలో దుస్తులు ఆరేస్తూ గురువారం ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందింది. గాయత్రి పెదనాన్న పి.నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

మహిళ అదృశ్యంపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతీనగర్ 5వ లైనులో నివాసం ఉండే గోపి భార్య స్వాతి ఈనెల 8న ఇద్దరు పిల్లల్ని తీసుకుని భర్తకు చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న గోపి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వృద్ధుడు అరెస్టు



ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వృద్ధుడిని ప్రత్తిపాడు సెబ్ అధికారులు అరెస్టు చేశారు. సెబ్ ఎస్ఐ గీత తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన గాలిదిన్నె కృష్ణారావు అక్రమంగా గుట్టు చప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం గురువారం సాయంత్రం సెబ్ అధికారులకు అందింది. దీంతో ఎస్ఐ గీత సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్థానిక గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డులో పాతమల్లాయపాలెం కూడలిలో మద్యం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న కృష్ణారావు వద్ద నుంచి పది ఓల్డ్ అడ్మిరల్ బ్లూ క్లాసిక్ విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు గీత తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, నిల్వలను సహించబోమని ఆమె స్పష్టం చేశారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూనగర్: బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు గురువారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీ స్థల పన్ను వేయడంతో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. మార్ట్‌గేజ్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. సమస్యల్ని పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిల్డర్స్ ప్రతినిధులు నాగ వంశీ, శ్రీనాథ్, మధుసూదనరెడ్డి, సీతారామయ్య, సురేష్‌బాబు, శ్రీనివాస్‌కుమార్, దుర్గాప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

చలపతి విద్యార్థులకు ఫార్మా 2కే23 అవార్డులు


రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థిని

గుంటూరు రూరల్: ఔషధాల వినియోగాన్ని మెరుగుపరిచి మందుల లోపాలను తగ్గించటం ద్వారా రోగుల భద్రతను, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మా కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరంలోని వైద్యకళాశాల జింకానాలో జరిగిన ఫార్మా అవార్డ్ 2కే23 కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులకు అవార్డుల పంట పండిందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ చేతుల మీదుగా తమ కళాశాల విద్యార్థులు అవార్డులు అందుకోవటం సంతోషకరమన్నారు. తమ కళాశాలలో బీ ఫార్మసీ విభాగం నుంచి పీ రమ్యశ్రీ, ఫార్మాడీ విభాగం నుంచి ఎమ్ లావణ్య, ఎమ్ ఫార్మసీ నుంచి టీ రవళిక, అనాలసిస్ నుంచి ఏ సాయిదివ్య, ఫార్మాంకాలజీ నుంచి పీ చైతన్యసాయి, రెగ్యులేటరీ ఎఫైర్ నుంచి ఎమ్ లక్ష్మిదివ్య, ఎస్ సాయితేజస్వీలు అధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు అవార్డులు అందజేశారన్నారు. ఈ సందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అధ్యాపకులు అవార్డులు పొందిన విద్యార్థులను అభినందించారు.

ఆనంద నిలయాలు అంగన్‌వాడీ కేంద్రాలు


పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

చినలింగాయపాలెం(కాకుమాను): అంగన్‌వాడీ కేంద్రాలు ఆనంద నిలయాలని ప్రతి ఒక్కరు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలను గురువారం ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ముజావర్ గుల్జార్ బేగంలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్యతో పాటు మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన పోషక పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ గుల్జార్ బేగం, మండల ప్రత్యేకాధికారిణి ప్రేమ కుమారి, ఎంపీటీసీ ఏసేబు, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ ఉన్నారు.

వీవీఐటీలో ‘అమేయ 2023’



సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి తదితరులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మెకానికల్, స్టూడెంట్ అసోసియేషన్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధ, గురువారాలలో సాంకేతిక సదస్సు అమేయ 2023 వేడుకలు నిర్వహించారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో నిర్వహించిన ఈ కారక్రమానికి ముఖ్య అతిథిగా ట్రూజలర్ ఇండియా, విజయ ట్యాంక్స్ అండ్ వెజెల్స్ ఇంజనీర్, అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీశ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌లకు ఎప్పటికీ ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ముందుగా ఆరు అంశాలలో నిర్వహించిన సాంకేతిక పోటీలలో 1840 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యాడ్ కాంటెస్ట్, జికిటిక్, టెక్‌హంట్, రీ అసెంబుల్ ర్యాలీ, పిక్టో వంటి సాంకేతిక పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఫైనాన్స్ డాక్టర్ కె.సత్యన్నారాయణ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ప్రత్తిపాడు: చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య విభాగం డీఈ రమేష్ అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని స్వచ్ఛభారత్ మిషన్, యూనిసెఫ్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతపై గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భవనం వెంకట రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ రమేష్ హాజరయ్యారు. ఏడు దశల్లో చేతుల పరిశుభ్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జనల తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని జిల్లా కోర్డినేటర్ షఫీ ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా లేకపోవడం వలన అనేక వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. చేతుల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు, మీ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలన్నారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈ అనిల్ కుమార్, ఏఈ వినీల్ కుమార్, మండల విద్యాశాఖధికారి సీహెచ్ రమాదేవి, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, జిల్లా కో ఆర్డినేటర్ షఫీ, సాయి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తాం


అప్పిరెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా, సురేష్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలంతా పూర్తి సమన్వయంతో ఉమ్మడిగా కలసి పనిచేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ దంపతులు ఆయన్ను సాదరంగా స్వాగతించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణుల్ని ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ లేళ్ల అప్పిరెడ్డిని శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమించడం ద్వారా సమర్థుడైన రాజకీయ నాయకుడికి సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని తెలిపారు.

ఉర్దూ పాఠశాలలో రికార్డుల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆనందపేటలోని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను గురువారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని ఆయన పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు, తీరుతెన్నులపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు.

విజ్ఞాన్‌లో అబెట్ అక్రిడిటేషన్ ప్రాసెస్ బృందం


విజ్ఞాన్‌లో అబెట్ అక్రిడిటేషన్ బృందం సభ్యులతో వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) అక్రిడిటేషన్ ప్రాసెస్ కమిటీ బృందం తనిఖీ చేసింది. అమెరికా నుంచి వచ్చిన 11 మంది సభ్యులతో కూడిన బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ పీ నాగభూషణ్ మాట్లడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకుని తనిఖీ పూర్తి చేసుకున్న మొట్ట మొదటి యూనివర్సిటీ విజ్ఞాన్ అని తెలియజేసారు. అబెట్ అక్రిడిటేషన్ సాధించినట్లైతే విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలియజేసారు. వీటితో పాటు విదేశాలలో ఉన్న యూనివర్సిటీలతో విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఎక్చేంజ్ ప్రోగ్రామ్స్, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అవకాశాలు ఉంటాయన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఐక్యూఏసీ సిబ్బంది, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

చల్లావారిపాలెంను సందర్శించిన కేరళ ప్రతినిధుల బృందం

గుంటూరు రూరల్: గ్రామాల అభివృద్ధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందంజలో ఉందని జిల్లా పరిషత్ సీఈవో జె.మోహనరావు తెలిపారు. గురువారం కేరళకు చెందిన ప్రతినిధుల బృందం బీతు బాలకృష్ణన్ తదితరులు చల్లావారిపాలెం గ్రామాన్ని సందర్శించారు. సీఈవో మాట్లాడుతూ చల్లావారిపాలెం గ్రామం 2001-2015 ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు సెలక్టయిన సందర్భంగా కేరళ ప్రతినిధుల బృందం గ్రామాన్ని సందర్శించిందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం పనితీరును తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ప్రజల ఇంటివద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశంసించారు.

నడకే అన్ని జబ్బులకు మందు



గుంటూరు మెడికల్: ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, నడక దాదాపు అన్ని జబ్బులకు మందు అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి చెప్పారు. వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకొని ఐఎంఏ గుంటూరు బ్రాంచి, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌లో ఆర్థరైటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు ప్రారంభించారు. వాకర్స్‌తో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఎండీ మిషన్ ద్వారా ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎముకల పరిపుష్టికి కాల్షియం ఆధారిత ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రోజూ నడకతో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గుంటూరు రూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లైఫాక్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో జి.భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీపై వారంరోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. కావున సైబర్ నేరాలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ రాజీవ్‌జట్సన్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.